بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 10.11.2017 (TELUGU)**

**ఒక జాతి శత్రుత్వము మీరు అన్యాయము చేయుటకు ప్రోత్సహించకూడదను పవిత్ర ఖుర్ఆన్ ఆదేశము ఎంత మధురమైనది. ఇటువంటి ఆదేశము మరే మత గ్రంధములో కనిపించదు. జాతులు, మతములతో ఈ విధముగా ప్రతీకారము తీర్చుకొనుట, అన్యాయముతో వ్యవహరించుట ఒక విశ్వాసికి తగదు. ఓ విశ్వాసులారా! అల్లాహ్ కొరకు సాక్షులుగా మారుము. తనకు విరుద్ధముగా లేదా తల్లి దండ్రులకు, సమీప బంధువులకు విరుద్ధముగా సాక్ష్యమివ్వలసి వచ్చినను న్యాయమును గట్టిగా స్థాపించువారగుము.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 10.11.2017 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మార్డన్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఈ క్రింది సూక్తులను పఠించిరి.

يٰۤاَيُّهَا الَّذِيۡنَ اٰمَنُوۡا كُوۡنُوۡا قَوّٰمِيۡنَ بِالۡقِسۡطِ شُهَدَآءَ لِلّٰهِ وَلَوۡ عَلٰۤى اَنۡفُسِكُمۡ اَوِ الۡوَالِدَيۡنِ وَالۡاَقۡرَبِيۡنَ ۚ اِنۡ يَّكُنۡ غَنِيًّا اَوۡ فَقِيۡرًا فَاللّٰهُ اَوۡلٰى بِهِمَا ۖ فَلَا تَتَّبِعُوا الۡهَوٰٓى اَنۡ تَعۡدِلُوۡا ۚ وَاِنۡ تَلۡوٗۤا اَوۡ تُعۡرِضُوۡا فَاِنَّ اللّٰهَ كَانَ بِمَا تَعۡمَلُوۡنَ خَبِيۡرًا (سورۃ النساء:136) يٰۤاَيُّهَا الَّذِيۡنَ اٰمَنُوۡا كُوۡنُوۡا قَوّٰمِيۡنَ لِلّٰهِ شُهَدَآءَ بِالۡقِسۡطِ ۖ وَلَا يَجۡرِمَنَّكُمۡ شَنَاٰنُ قَوۡمٍ عَلٰٓى اَلَّا تَعۡدِلُوۡا ؕ اِعۡدِلُوۡا ۖ هُوَ اَقۡرَبُ لِلتَّقۡوٰى ۖ وَاتَّقُوا اللّٰهَ ؕ اِنَّ اللّٰهَ خَبِيۡرٌۢ بِمَا تَعۡمَلُوۡنَ (سورۃ المائدہ:9) وَمِمَّنۡ خَلَقۡنَاۤ اُمَّةٌ يَّهۡدُوۡنَ بِالۡحَقِّ وَبِهٖ يَعۡدِلُوۡنَ (سورۃ الاعراف:182)

ఓ విశ్వాసులారా! మీకు, మీ తల్లిదండ్రులకు, మీ బంధుమిత్రులకు గాని విరుద్ధముగానైనా పరిపూర్ణముగా న్యాయమును పాటింపుము. అల్లాహ్‌కు సాక్షులుగా నుండుము. ఎవ్వరినుద్దేశించి సాక్ష్యమివ్వబడినదో వారు కలవారైనను, లేనివారైనను, వారిరువురి ఉత్తమ హితోషి అల్లాహ్ తుచ్ఛ కోరికలను మీరు అనుసరించుచున్నంత వరకు మీరు న్యాయ సమ్మతముగా ప్రవర్తించలేరు. మీరు సాక్ష్యమును దాచి సత్య ప్రకటనమునకు అవరోధము కలిగించినచో మీరు చేయుచున్న దంతయు అల్లాహ్ నిశ్చయముగా బాగుగా తెలుసుకొనగలడు. (అన్నిసా:136)

ఓ విశ్వాసులారా! అల్లాహ్ ఆశయము కొరకు ధృఢముగా నిలువుము. న్యాయము కొరకు సాక్షులై యుండుము. ఒక జాతి పట్ల మీకు యున్న శత్రుత్వము వలన దానికి మీరు అన్యాయము చేయకుందురు గాక! న్యాయము చేయుము. అది ధర్మమునకు అత్యంత సమీపము. అల్లాహ్‌కు భయపడుము. నిశ్చయముగా మీరు చేయునదంతయు అల్లాహ్‌కు విధితమే. (అల్‌మాయిదహ్:9)

మేము పుట్టించినవారిలో సత్యముతో మానవులకు మార్గదర్శనము చేయువారుండిరి. దాని ద్వారనే న్యాయము చేయుచుండిరి. (అల్ ఆరాఫ్:182)

అల్లాహ్ తఆలా ఏ విధముగా న్యాయ ప్రామాణికమును స్థాపించుటకు ముస్లిములను ఆదేశించెనో మరే ధర్మములో అటువంటి ప్రామాణికము లభించదు. కాని దురదృష్టవశాత్తు నేడు ముస్లిములలోనే అనేకులు అనగా నాయకులు కూడ, ధర్మ పండితులు కూడ న్యాయముగా వ్యవహరించడం లేదు. ఇదే విధముగా గృహములలో, సామాన్య ప్రజలలో సామాన్య ముస్లిములు, రోజువారి కార్యక్రమాలలో న్యాయమును అల్లాహ్ తఆలా ఆదేశించిన

విధముగా, ఒక విశ్వాసితో ఆశించిన మేరకు ఉత్తమ రీతిలో నేరవేర్చడం లేదు. కుటుంబములలో అసంతృప్త సమస్యలు గలవు. పురుషులు, స్త్రీలు ఇరువురి నుండి కొన్ని సార్లు తప్పుడు సంఘటనలతో న్యాయస్థానములలో వాజ్యములు వేయబడును. తప్పుడు సాక్ష్యాలు ప్రవేశపెట్టుతారు. అక్రమ హక్కులు పొందుటకు, మరొకరి హక్కులను హరించుటకు అబద్ధము, తప్పుడు సాక్ష్యముతో వ్యవహరిస్తారు. అసత్యమునకు పాల్పడేవారు చాలా మంది యున్నారు. అబద్ధమాడి న్యాయస్థానమును కూడ మోసము చేస్తారు. కొన్ని చోట్ల న్యాయమూర్తులు తమ స్వార్థముల కొరకు తప్పుడు తీర్పులు చెప్తారు. ఒక రకంగా వ్యవస్థయే తలక్రిందులైనది. సంక్షిప్తముగా చెప్పాలంటే అన్యాయము వలన సమాజములో అనేక దుష్టత్వములు వ్యాపించుచున్నవి. జాతీయ స్థాయిలో న్యాయ అవసరములు పూర్తి కావడం లేదు. తమ పౌరులతో కూడ న్యాయముగా వ్యవహరించరు. దేశములు పరస్పరం కూడ న్యాయముగా వ్యవహరించవు. ధర్మపండితులు తమ స్వార్థములను సాధించుటకు మతమునపయోగించుచున్నారు. మేము ఉత్తమ పక్షము, ప్రపంచ సమస్యలకు ఇస్లాం మాత్రమే సరియైన పరిష్కారము చూపునని ముస్లిములు ప్రకటిస్తారు. వారు అల్లాహ్ తఆలా అదేశములను పాటించినచో, పవిత్ర ఖుర్ఆన్ బోధనలను ఆచరించినచో నిస్సందేహముగా ముస్లిములు ఉత్తమ పక్షమే. ఇస్లాం బోధన మేరకు సత్యము, న్యాయమును స్థాపించినచో నిశ్చయముగా ఇస్లాం ప్రపంచ సమస్యలన్నిటికి పరిష్కారము చూపును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేను పఠించిన ఈ సూక్తులు అన్నిసా, అల్‌మాయిదహ్, అల్ ఆరాఫ్ మూడు భిన్నమైన అధ్యాయములలోనివి. అన్నిసాలోని మొదటి సూక్తి అనువాదమిట్లు గలదు. ఓ విశ్వాసులారా! మీకు, మీ తల్లిదండ్రులకు, మీ బంధుమిత్రులకు గాని విరుద్ధముగానైనా పరిపూర్ణముగా న్యాయమును పాటింపుము. అల్లాహ్‌కు సాక్షులుగా నుండుము. ఎవ్వరినుద్దేశించి సాక్ష్యమివ్వబడినదో వారు కలవారైనను, లేనివారైనను, వారిరువురి ఉత్తమ హితోషి అల్లాహ్ తుచ్ఛ కోరికలను మీరు అనుసరించుచున్నంత వరకు మీరు న్యాయ సమ్మతముగా ప్రవర్తించలేరు. మీరు సాక్ష్యమును దాచి సత్య ప్రకటనమునకు అవరోధము కలిగించినచో మీరు చేయుచున్న దంతయు అల్లాహ్ నిశ్చయముగా బాగుగా తెలుసుకొనగలడు.

గొప్ప న్యాయమును స్థాపించుటకు ఈ ఆదేశము గలదు. స్వంత కుటుంబ విషయములు, సామాజిక విషయములలో కూడ ఎటువంటి పరిస్థితులు ఎదురైనా న్యాయమును సదా స్థాపించవలెను. అల్లాహ్ తఆలా కొరకు, అల్లాహ్ తఆలా ఆదేశముల మేరకు విశ్వాసి సాక్ష్యము యుండవలెను. అల్లాహ్ తఆలాపై సంపూర్ణ నమ్మకము యుండి, విశ్వాస ప్రామాణికము గొప్ప స్థాయికి చేరి గట్టిగా యున్నప్పుడే ఇది సాధ్యమగును. తనకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చుటకు సిద్ధమైనప్పుడు, తన భార్యాపిల్లలకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చుటకు సిద్ధమైనప్పుడు, అవసరమైనచో తమ తల్లిదండ్రులకు వ్యితిరేకంగా సాక్ష్యమిచ్చుటకు సిద్ధమైనప్పుడు, తమ సమీప బంధువులకు విరుద్ధముగా సాక్ష్యమిచ్చుటకు సిద్ధమైనప్పుడే విశ్వాస గట్టితనము తెలియును. కోరికలను అనుసరించినచో న్యాయము నుండి దూరమగుదురు. తమ కోరికలను అనుసరించినచో నీతి, నిజాయితిని కోల్పోతారు. అల్లాహ్ తఆలా ఆశించిన విధముగా నీతి, నిజాయితి ప్రామాణికమును పొందనందుకే నేడు సమాజములో అనేక సమస్యలు ఏర్పడినవి. తమ మాటలను వంకర తిరుగుడుగా చెప్పడం సర్వ సాధారణమైపోయినది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ చేసిన తరువాత కూడ ప్రపంచ ఆర్భాటాలకు ప్రభావితమై కొన్ని సందర్భాలలో మన లోని కొందరు ఇటువంటి మాటలు మాట్లాడుతారు. సత్యదూర సాక్ష్యములు

ఇస్తారు. తమకు స్వంతముగా లేదా తల్లిదండ్రులకు నష్టము కలిగినను వంకర తిరుగుడు మాటలు మాట్లాడకూడదని అల్లాహ్ తఆలా ఆదేశించును. వాస్తవాలను మరుగున పెట్టుటకు మాట్లాడినట్లు లేదా నిజమైన సాక్ష్యము తెలుపుటకు వెనుకాడుచున్నట్లు తెలియకూడదు. మనము రోజువారి విషయములలో చూచుచున్నాము. ఉదా॥ భార్యా భర్తల విషయములు గలవు. న్యాయస్థానములో ఇటువంటి చాలా సమస్యలు వచ్చుచుండును. అక్కడ సత్యమును పాటించరు. ఆర్థిక లావాదేవీల విషయములలో కూడ వాస్తవాలు తెలుపరు. ధార్మిక విద్యావంతులు లేదా సేవలో ముందుంజలో యున్నవారు కూడ అనుచిత పనులు చేస్తుంటారు. బాహ్యములో ఇంత పెద్ద విద్యావంతులు ఇటువంటి పనులు చేయగలరా అని మానవుడు ఆశ్చర్యానికి గురగును.

మనము నమ్మిన ఇమామ్ పవిత్ర ఖుర్‌ఆన్ ఆదేశమును పాటించుచు ఇతరులు కూడ ఆశ్చర్యానికి గురయ్యే విధముగా గొప్ప ఉదాహరణలను నెలకొల్పిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ వంశీకులకు వ్యతిరేకంగా ఒక వాజ్యమునకు హాజరైరి. న్యాయము, నీతిని పాటించుచు సత్యమే పలికిరి. ఫలితముగా వంశీకులకు లబ్ది కలిగి తమ తండ్రికి నష్టము కలిగెను. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ దాసున్ని మనము విశ్వసించినాము. వారి ఆదర్శమిట్లు గలదు. ఈ ఆదర్శమును మనము గమనించుచు తమ సాక్ష్యముల ప్రతి సమస్యను పరిశీలించవలసిన అవసరమున్నది.

అల్లాహ్ తఆలా కొరకు సాక్షిగా మారుచు, న్యాయమును గట్టిగా పాటించుచు తమ సాక్ష్యముల ప్రామాణికమును స్పష్టమైన మాటల వరకు చేర్చినప్పుడు సంరక్షకుడైన, ఆహార ప్రదాత స్వయముగా ఆహారములో శుభము కలిగించును. కనుక అనుక్షణం తమ ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. ఇటువంటి న్యాయ ప్రామాణికమును మనము స్థాపించుటకు ప్రయత్నించనిచో గృహముల శాంతి భగ్నమగును. సమాజ శాంతి, సుఖము కూడ నిలువదు. మాయిదహ్ అధ్యాయములోని 9వ సూక్తిని నేను పఠించితిని. దాని అనువాదమిట్లు గలదు.

ఓ విశ్వాసులారా! అల్లాహ్ ఆశయము కొరకు ధృఢముగా నిలువుము. న్యాయము కొరకు సాక్షులై యుండుము. ఒక జాతి పట్ల మీకున్న శత్రుత్వము దానికి మీరు అన్యాయము చేయకుందురు గాక! న్యాయము చేయుము. అది ధర్మమునకు అత్యంత సమీపము. అల్లాహ్‌కు భయపడుము. నిశ్చయముగా మీరు చేయునదంతయు అల్లాహ్ కు విధితమే. (అల్‌మాయిదహ్:9)

హుజూరె అన్వర్ ఇట్లనిరి. కొన్ని చోట్ల విభేదములుండును. ఇదే కారణము వలన ఇతర మతస్తులు దౌర్జన్యము కూడ చేస్తారు. జాతులు, మతాలతో అదే విధముగా దౌర్జన్యమునకు పాల్పడుచు న్యాయమును పాటించకుండా ప్రతీకారము తీర్చుకొనుట ఒక విశ్వాసికి తగదు. అల్లాహ్ తఆలా ఆదేశములను గట్టిగా పట్టుకొని, వాటిని పాటించుట, వాటిలో ఏమాత్రం నిర్లక్ష్యము వహించక పోవడం ఒక విశ్వాసికి తప్పనిసరి. న్యాయమును బలపరచుచు సాక్షిగా మారుట అనగా ఇస్లామీయ బోధనకు కట్టుబడి యుండుము. మీ ఆచరణ ప్రజలకు, ఇతర మతాలకు, సమాజము కొరకు ఆదర్శము కావలెను. ఇతర జాతులకు కూడ ఆదర్శము కావలెను.

నేడు ముస్లిముల అన్యాయముల గురించి పశ్చమములో చాలా విషయములు మాట్లాడుతారు. తమ స్వంత మతస్తులతో న్యాయము చేయనివారు ఇతరులతో ఎలా న్యాయము చేయగలరు. ఇదెంతో విచారకరము. ముస్లిములే తమ పనులతో ఇస్లాంను అపనిందకు గురిచేయచున్నారు. పాలకులు పౌరుల హక్కులు హరించుచున్నారు. పౌరులు పాలకులతో జగడమాడుచున్నారు. ప్రభుత్వములతో యుద్ధము చేయుచున్నారు. ప్రాంతాలకు ప్రాంతాలు హింసకు

గురగుచున్నవి, నాశనమగుచున్నవి. నామమాత్రపు ఇస్లామీయ పక్షములు తమ ప్రజలను హతమార్చుచున్నారు. విదేశాలలో కూడ హింసాత్మక చర్యలకు పాల్పడుచున్నారు. వీరు మా ప్రజలను హతమార్చుచున్నందున మేమీ దౌర్జన్యము చేయుచున్నామని వాదించుచున్నారు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. జాతులతో ఈ శత్రుత్వము ముందుందు శత్రుత్వమును మరింత పెంచును. ఈ పరంపర ఎన్నడు అంతము కాదు. ఒక జాతితో శత్రుత్వము మీరు న్యాయ సూత్రములను పాటించకుండా చేయకూడదు. న్యాయ సూత్రములను తప్పక పాటించవలెను. న్యాయమును పాటించని కారణము వల్లనే హింస పెరుగుచున్నది. ముస్లిముల ఆచరణ పద్ధతులు ఇస్లాం బోధనకు విరుద్ధముగా యున్నందు వల్లనే ముస్లిమేతరులు మనకు వ్యతిరేకంగా మారుచున్నారు. ముస్లిములు తమ ఆదర్శమును చూపుచు ఇస్లాం అందమైన బోధనను ప్రపంచానికి తెలియజేయుచు ప్రచారము చేయవలసిన అవసరముండెను. కానిక్కడ భిన్నమైన పరిస్థితి గలదు. ఒక జాతితో శత్రుత్వము మీరు న్యాయ సూత్రములను పాటించకుండా చేయకూడదను బోధన మరే మత గ్రంథములో కనిపించదు.

శత్రువులతో కూడ వ్యవహరించుచున్నప్పుడు న్యాయ సూత్రములను పాటించవలెను.

అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుచు మనము జీవితము గడుపువారమగుదుము గాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ హక్కును చెల్లించువారమగుదుము గాక! మనము ఇతరుల కొరకు ఆదర్శముగా నిలుచువారమగుదుము గాక!

గౌ॥ హసన్ ముహమ్మద్ ఖాన్ తండ్రి గౌ॥ ఫజల్ ముహమ్మద్ ఖాన్ షిమ్లవీ గారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని హుజూరె అన్వర్ ప్రకటించి వారి సద్గుణములను తెలిపిరి.

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.......................................................................

.......................................................................

.......................................................................